# ఇంటర్ తర్వాత ఏం చదవాలి?

**'లక్ష్యం-2024' పేరిట నేడు కొత్తగూడెంలో అవగాహన సదస్సు**

**'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ' ఆధ్వర్యంలో నిర్వహణ**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 22 : ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఏయే కోర్సులు చదవాలి.. ఎటువైపు వెళితే జీవితంలో త్వరితగతిన స్థిరపడవచ్చు.. మంచి ఉద్యోగం చేయవచ్చు అనే అంశంపై 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ' సంయుక్తంగా 'లక్ష్యం-2024' పేరుతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం సమీపంలోని లక్ష్మీదేవిపల్లిలో గల కృష్ణవేణి జూనియర్ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సదస్సు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా కేఎల్ యూనివర్సిటీ అధికారులు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే బాధ్యులు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఖమ్మంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ప్రతిమలతో పూజలు

# జనం.. రామజపం

**అయోధ్యలో వైభవంగా బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం**

- ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మార్మోగిన రామనామం
- 'జై శ్రీరాం.. జైజై శ్రీరాం' అంటూ యువత బైక్ ర్యాలీలు
- ఆలయాలు, ఇళ్లల్లో రామయ్యకు ప్రత్యేక పూజలు
- ఇళ్ల ముంగిళ్లను రామరథంతో అలకరించిన మహిళలు
- గ్రామాల్లో భారీ తెరలపై వేడుకను తిలకించిన భక్తజనం, పలుచోట్ల అన్నదానాలు




ఖమ్మం: పూజల్లో మహిళా భక్తులు



ఖమ్మంలో పూజలు చేస్తున్న మేయర్ నీరజ




చుంచుపల్లి: ఎల్‌సీడీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



ఖమ్మం: ఇంటి ముందు ముగ్గులతో అలంకరణ



ఏ నోట విన్నా రామజపమే.. ఊరూవాడ రాములోరి కాషాయజెండాల రెపరెపలమయం.. ఆలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు. ఇళ్ల ముంగిళ్లలో రంగురంగులతో రామరథం ముగ్గులు.. జై శ్రీరాం.. జైజై శ్రీరాం అంటూ హోరెత్తిన యువకుల ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు.. వెరసి ఉమ్మడి ఖమ్మంజిల్లా అంతటా సోమవారం పండుగ వాతావరణం నెలకొన్నది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తిభావం ఉప్పొంగింది. రామయ్య, సీతమ్మ, లక్ష్మణుడు, హనుమంతుడి వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. మహిళలు, యువతులు రామయ్య పాటలు పాడుతూ కోలాటాలతో శోభాయాత్రలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. అయోధ్యలో జరిగిన వేడుకను తిలకించేందుకు గ్రామాల్లో భక్తమండళ్లు భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఇళ్లల్లో సైతం కుటుంబసమేతంగా ఆ అపురూప ఘట్టాన్ని టీవీల్లో తిలకించారు. అయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలను ఇంటింటికీ పంచిపెట్టగా వాటిని పూజా మందిరంలో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భద్రాచలం రామాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మంలోని పలు ప్రధాన సెంటర్లలో గల వ్యాపార సముదాయాలు, దుకాణాల ఎదుట గంటలు కొట్టి భక్తిభావాన్ని చాటుకున్నారు. కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని రైటర్‌బస్తీలో త్రిమాత శక్తిపీఠం వద్ద భారీ ఎల్ఈడీలు ఏర్పాటుచేశారు. సాయంత్రం ఇళ్ల ముంగిళ్లలో దీపాలు వెలిగించారు.

*– భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 22 (నమస్తే తెలంగాణ)/ ఖమ్మం*



## భద్రాద్రిలో ప్రత్యేక పూజలు



భద్రాచలం, జనవరి 22 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అంతరాలయంలోని మూలవరుల వద్ద విశేష పూజలు చేసిన అనంతరం బేడా మండపం వద్ద స్వామివారి నిత్య కల్యాణ మూర్తులకు సువర్ణ పుష్పార్చన చేపట్టారు. తర్వాత దేవస్థానం ప్రచార రథంతో మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, భక్తుల రామనామ స్మరణతో శోభాయాత్ర నేత్ర పర్వంగా సాగింది. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని భద్రాద్రి రామాలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం దీపోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా జరిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ రవీందర్‌రాజు, అనిల్‌కుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. కాగా.. వివిధ భక్త సమాజ బృందాలు, పలు అధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలో పాదయాత్ర, బైక్ యాత్ర చేపట్టారు.



చర్ల : రథయాత్రలో పాల్గొన్న భక్తులు



భద్రాచలం శోభాయాత్రలో భక్తులు



భద్రాచలం రామాలయంలో దీపాలతో అలంకరణ



ఖమ్మం :సీతారామచంద్రులకు పూజలు చేస్తున్న భక్తులు



ఖమ్మం ఎడ్యుకేషన్ : జైశ్రీరాం ఆకారంలో విద్యార్థులు



ఖమ్మం: ప్రదర్శన నిర్వహిస్తున్న మార్వాడీలు



అశ్వారావుపేట టౌన్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



పాతకొత్తగూడెంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో తులసీదళాల అర్చనలో పాల్గొన్న భక్తులు



మణుగూరుటౌన్: ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు



ఖమ్మం: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



సారపాక : ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

# పదింతల బాధ్యత పెంచేలా..!

- ప్రభుత్వ పాఠశాలల్లో 'టెన్త్' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయం
- విద్యాశాఖ ప్రణాళికలపై రేపు కలెక్టరేట్‌లో సమీక్ష
- ఎంఈవోలు, హెచ్‌ఎంలకు కలెక్టర్ వీపీ గౌతమ్ దిశానిర్దేశం



ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 22: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఒక విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైనవి. బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలంటే ఎవరైనా మంచి మార్కులతో ఈ మజిలీ దాటాల్సిందే. జడ్పీ, కేజీబీవీ, సంక్షేమ, ఎయిడెడ్.. ఇలా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న విద్యాలయాల్లో ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అడుగులు వేస్తున్నది. దీనిలో భాగంగా బుధవారం ఖమ్మంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్ ఆయా పాఠశాలల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులను సమీక్షించనున్నారు. పదోతరగతి విద్యార్థులతోపాటు ఇతర తరగతుల విద్యార్థుల సామర్థ్యాల పైనా కలెక్టర్ చర్చించనున్నారు.

**విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకూ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టేందుకు అవసరమైన ప్రణాళికలను డీఈవో సోమశేఖరశర్మ ఇప్పటికే కలెక్టర్ వీపీ గౌతమ్‌కు నివేదికలు అందజేశారు. మరోవైపు పదోతరగతికి సంబంధించిన ఆరు సబ్జెక్టులు ఏడు పరీక్షలకు అనుగుణంగా సీసీఈ విధానంలోనే ప్రాక్టీస్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించేలా ప్రశ్నాపత్రాల రూపకల్పనకు అడుగులు పడుతున్నాయి. అలాగే సర్కార్ పాఠశాలల్లో డిసెంబర్– 2024 ఎఫ్‌ఎల్‌ఎన్ నెలవారీ అచీవ్‌మెంట్ రిపోర్ట్, వర్క్‌బుక్స్, అభ్యాస దీపికలు, ఐఎఫ్‌పీఎస్, ఇతర డిజిటల్ రిసోర్సెస్ వినియోగం, ఇంగ్లిష్ మీడియం అమలుపై కలెక్టర్ సూచనలు ఇవ్వనున్నారు.

**సమ్మేటివ్ ఫలితాలపై సమీక్ష...**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షల ఫలితాలను బేరీజు వేసుకుని ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్షించనున్నారు. సిలబస్ ప్రకారం ఎస్ఏ–1 యూనిట్లు, పూర్తయిన సిలబస్, సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వచ్చిన గ్రేడ్స్‌పై ప్రధానంగా చర్చ జరుగనున్నది. ఏ, బీ గ్రేడ్స్ సాధించిన విద్యార్థులు ఎలాగైనా ఉత్తీర్ణత సాధిస్తారు. సీ గ్రేడ్ సాధించిన విద్యార్థులూ కొంత సాధన చేస్తే ఉత్తీర్ణులవుతారు. ఇక తంటా అంతా డీ, ఈ గ్రేడ్ విద్యార్థులతోనే. వారు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుంది. సమీక్ష మొత్తం ఈ అంశాలపైనా జరుగనున్నది.

# జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



వినతులు స్వీకరిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లా, బ్లాకుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా, బ్లాకుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల రూపకల్పన, గణతంత్ర దినోత్సవం, దిశా కమిటీ సమావేశం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు స్థానిక సంస్థలు కార్యాచరణ తయారుచేయాలని, 29 అంశాలపై జిల్లా బ్లాకు నివేదికలు తయారుచేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గతంలో చేపట్టిన పనులు కాకుండా నూతన పనులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు నివేదికలు అందజేయాలన్నారు. గ్రామ పంచాయతీ ప్రణాళికల పర్యవేక్షణకు డీపీవో రమాకాంత్, మండలస్థాయిలో జడ్పీ సీఈవోను నోడల్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు. అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకలపై సమీక్షించారు. ఈ నెల 24వ తేదీ వరకు అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ నెల 25వ తేదీన ఉదయం 10గంటలకు దిశా కమిటీ సమావేశం ఉంటుందని, అన్నిశాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, ఏఎస్పీ విజయబాబు, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు**

కొత్తగూడెం టౌన్, జనవరి 22 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణికి జిల్లా నుంచి 144 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్వో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

# త్వరితగతిన పరిష్కరించాలి

**ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్**



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

మామిళ్లగూడెం, జనవరి 22 : అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. మద్దెల సంఘవి, వైరా మండలం సిరిపురానికి చెందిన తడికమల్ల స్వర్ణలత, చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన ఎస్.కె.జాన్‌సాహెబ్, ఖమ్మంలోని తుమ్మలగడ్డకు చెందిన ఎస్.కె.యాకూబ్ పాషా, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన దండా మురళి, బేబి ప్రసూన, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన డి.రాజా తదితరులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు సమర్పించారు. గ్రీవెన్స్‌లో జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, డీసీవో విజయకుమారి, జిల్లా వైద్యాధికారి బి.మాలతి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో విద్యాచందన, డీపీవో హరికిషన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కార్డుదారులు ఈ కేవైసీ పూర్తి చేయాలి

**డీఎస్‌వో చందన్‌కుమార్**



మాట్లాడుతున్న డీఎస్‌వో చందన్‌కుమార్

ఖమ్మం, జనవరి 22 : రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ నెలాఖరులోగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని కే.చందన్‌కుమార్ అన్నారు. సోమవారం సమీకృత కార్యాలయంలో జిల్లాలోని రేషన్ డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 73 శాతం మంది లబ్ధిదారులు ఇప్పటివరకు ఈ కేవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన 27 శాతం మంది కూడా పూర్తి చేసుకునే విధంగా రేషన్ డీలర్లు చొరవ చూపాలన్నారు. ప్రతి డీలర్ మండల స్థాయి స్టాక్ పాయింట్ నుంచి నాణ్యమైన సరుకులు తీసుకెళ్లి కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.